


భూభారతి... రైతులకు వరం

- సాదా బైనామాలకు మోక్షం
- రెవెన్యూ ట్రిబ్యునల్‌కు అవకాశం
- పాస్ పుస్తకాలు నేరుగా రైతుల ఇంటికే
- 'ఆంధ్రజ్యోతి'తో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి

6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం KHAMMAM

మంగళవారం, 1 ఏప్రిల్ 2025



గొల్లగూడెం ఈద్గాలో సామూహిక ప్రార్థనలు

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఘనంగా రంజాన్ వేడుకలు

- ఖమ్మంలోని గొల్లగూడెం ఈద్గాలో పాల్గొన్న మంత్రి తుమ్మల
- ముస్లింలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- సామూహిక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు

వివరాలు : 6లో




ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ.67.5 కోట్లు

- ముగిసిన గడువు...
- మరో నెల పెంచాలంటున్న దరఖాస్తుదారులు

ఖమ్మం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు చివరి మూడురోజులు దరఖాస్తుదారుల నుంచి కదలిక వచ్చింది. సోమవారం గడువు పూర్తి అయింది. రాత్రి తొమ్మిది గంటల సమయానికి 15,860 దరఖాస్తుదారుల నుంచి రూ.67.50 కోట్లు ఆదాయం వరించింది. 25శాతం రాయితీ ఇవ్వడంతో దరఖాస్తుదారులు చివరి సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు ఆసక్తి చూపించారు. వచ్చిన ఆదాయంలో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే రూ.38కోట్లు వరకు ఆదాయం లభించడం విశేషం. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం లక్షకు పైగా దరఖాస్తులు రాగా సుమారు 70 వేల దరఖాస్తులకు ఎల్‌ఆర్‌ఎస్ కట్టుకునేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. కొన్ని భూములు బఫర్ జోన్, చెరువు శిఖాలు, ఎన్నెస్పీ, ప్రభుత్వ భూములు ఉండటంతో వాటికి అనుమతి ఇవ్వలేదు. జిల్లాలో రూ.100 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సోమవారంతో ముగుస్తున్న గడువును ఏప్రిల్ నెల కూడా పెంచితే మరికొంత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

సాగునీటి సౌలభ్యం లేని గిరిజనుల వ్యవసాయ భూములకు సాగునీరు కల్పించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరివికాసం పథకానికి నిధులు లేక ముందుకు సాగడం లేదు. ఈ పథకానికి రెండేళ్లుగా నిధుల కేటాయింపు లేకపోవడంతో గతంలో చేపట్టిన పనులు కొన్ని పెండింగ్‌లో ఉండగా కొత్తగా గిరిజనుల రైతుల నుంచి దరఖాస్తులు వస్తున్నా.. సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో గిరివికాసానికి పెద్దపీట వేయాలని అధికార యంత్రాంగం భావిస్తున్నా నిధులు లేకపోవడంతో పథకం లక్ష్యానికి చేరువకాలేకపోతోంది.



'గిరి' వికాసమేదీ?

గిరిజనులకు సాగునీటి కోసం గత ప్రభుత్వంలో ప్రత్యేక పథకం

- నిధులు లేక నీరుగారిపోతున్న లక్ష్యం
- గతంలో చేపట్టిన పనులు కూడా పెండింగ్‌లోనే..
- కొత్తగా దరఖాస్తులు వస్తున్నా.. మంజూరు చేయలేని పరిస్థితి
- సోలార్ పంప్ సెట్ల కోసం రైతుల అర్జీలు

ఖమ్మం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాగునీరు లేని గిరిజన రైతుల భూములకు సాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం 'గిరివికాస' పథకాన్ని రూపొందించింది. సన్న, చిన్నకారు గిరిజన రైతుల భూములకు బోర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, విద్యుత్ మోటర్లు మంజూరు చేసి సాగునీరు ఇవ్వాలన్నది ఈ పథకం ఆశయం. దీనికి అనుగుణంగా గతంలో ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ, డీఆర్‌డీఏ ద్వారా గిరిజన రైతులను ఎంపికచేసి వారికి గిరివికాస పథకం మంజూరు చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన రైతులు బంజర భూములను సాగు భూములుగా మార్చుకొని వరి, పత్తి, మిర్చి, కూరగాయల పంటలు కూడా సాగుచేశారు.

పెరుగుతున్న ప్రాధాన్యత

ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల పోడు భూములకు ప్రభుత్వం పట్టాలు అందించింది. కానీ ఆయా భూములకు సాగునీటి సౌకర్యం లేదు. దీంతో వర్షాధారంతోనే గిరిజన రైతులు పంటలు వేస్తున్నారు. పత్తి, జొన్న, పెసర, కంది వంటి పంటలు మాత్రమే సాగవుతున్నాయి. అటవీ భూములకు పట్టాలు ఇచ్చినందున బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయాలని అటు భద్రాచలం ఐటీడీఏతో పాటు ఖమ్మం, కొత్తగూడెం కలెక్టరేట్లకు గిరిజనులు భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. గతంలో విద్యుత్ లైన్లు వేయాలంటే సుమారు రూ.5లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉండేది. ఇది గిరివికాస పథకానికి భారంగా మారింది. నిధులు మంజూరు చేస్తున్నా- ట్రాన్స్‌కో అధికారులు గిరిజన గ్రామాల్లో లైన్లు, పోల్స్ వేయకపోవడం, అసంపూర్తిగా కాంట్రాక్టర్లు వదిలేయడంతో చాలాచోట్ల బోర్లు వేసిన రైతులు వాటిని వదిలేశారు.

అయితే ఇప్పుడు సోలార్ పద్ధతిలో 5, 10హెచ్‌పీ మోటార్లు కూడా నడిపిస్తుండడంతో తమకు సోలార్ పంపుసెట్లు కావాలని గిరిజన రైతులు గిరివికాసం కింద దరఖాస్తు చేస్తున్నారు. సోలార్ ద్వారా తక్కువ ఖర్చుతోనే రైతులకు బోర్లు, మోటార్లు అందించే సౌలభ్యం ఉంది. జిల్లాలో వెయ్యి మందికిపైగా గిరిజన రైతులు ఈ పథకానికి ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు దరఖాస్తు చేశారు. అటవీభూముల్లో బోర్లు, మోటార్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తే కూరగాయలు, పండ్లతోటలు, వాణిజ్య, ఆహారపంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుచేసేందుకు గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. సోలార్ పంపుసెట్ల ద్వారా అటు విద్యుత్ ఆదాతోపాటు యూనిట్ ఖర్చుకూడా భారీగా ఆదా అవుతుంది. గతంలో కొందరికి మంజూరు చేసిన (మిగతా 6వ పేజీలో)

పండుగ వేళ పెను విషాదం

- గేదె కోసం చెరువులోకి దిగిన తండ్రి
- నీట మునుగుతున్న తండ్రిని కాపాడేందుకు కుమారుడి యత్నం
- ఇద్దరూ నీట మునిగి మృతి
- ఆళ్లపాడులో ముస్లిం కుటుంబం కన్నీరుమున్నీరు



యూసఫ్‌ఖాన్ (ఫైల్)



కరీముల్లాఖాన్ (ఫైల్)

బోనకల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ రోజు ఓ ముస్లిం కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులంతా కలిసి సంతోషంగా పండుగ చేసుకోగా.. అంతలోనే వారి ఆనందం ఆవిరైంది. ఒకే కుటుంబంలో తండ్రి, కుమారుడు చెరువులో మునిగి మృతి చెందడంతో బోనకల్ మండలం ఆళ్లపాడులో తీవ్ర విషాదం నెలకొంది. ఆళ్లపాడు గ్రామానికి చెందిన పఠాన్ యూసఫ్‌ఖాన్ (72)కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు ఖమ్మంలో ఉంటున్నారు. మరో కుమారుడు పఠాన్ కరీముల్లాఖాన్ (45) తండ్రితో కలిసి గ్రామంలోనే ఉంటున్నాడు. వీరి ఇల్లు చెరువుకు ఎదురుగా ఉంటుంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న వారు రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు చేసుకొని ఇంటికి వచ్చారు.

సాయంత్రం నాలుగు గంటల సమయంలో గేదె చెరువు వైపునకు వెళుతోందని యూసఫ్‌ఖాన్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో యూసఫ్‌ఖాన్ గేదెకోసం చెరువులోకి దిగాడు. అయితే చెరువులోకి దిగిన తండ్రిని చూసిన కుమారుడు కరీముల్లా అతడిని తీసుకొచ్చేందుకు చెరువులోకి దిగాడు. అయితే గతంలో ఎక్స్‌కవేటర్‌తో తీసిన పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో ఈత రాని ఆ ఇద్దరూ ప్రమాదవశాత్తూ ఆ గుంతల్లోకి జారిపడి నీట మునిగి మృతి చెందారు. అటుగా వెళ్తున్న (మిగతా 6వ పేజీలో)

భూకంప జోన్‌లో భద్రాచలం

- జోన్-3 పరిధిలో ఉన్నట్టు అధికారుల నిర్ధారణ
- భద్రాచలం మినహా సేఫ్‌జోన్‌లో తెలంగాణ
- భవనాల నిర్మాణంలో నిబంధనల అమలుతోనే రక్షణ



భద్రాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో భూకంప జోన్‌లు మారనున్నాయి. ప్రస్తుతం ఐదు జోన్లుండగా వాటి సంఖ్య ఆరుకు పెరగనుంది. కాగా జోన్-3 భూకంప జోన్‌లోకి భద్రాచలం రానుంది. 1962లో తొలిసారిగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఐదు జోన్లను ఏర్పాటు చేయగా... భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) 1970, 84లో కొన్ని మార్పులు చేసి జోన్ల పరిధిలోని ప్రాంతాలను మార్చింది. అనంతరం వాటిని అభివృద్ధి చేయగా అప్పటినుంచి భూమి లోపల పలకాల కదలికలో వేగం (యాక్సలరేషన్) పెరుగుతూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు, నిపుణులతో కేంద్ర ప్రభుత్వం కమిటీని నియమించగా ఆ కమిటీ పలు భేటీల అనంతరం ఐదు జోన్లను ఆరు జోన్లుగా మార్చాలని నిర్ణయించింది. మరో రెండు నెలల్లో ఈ కొత్త జోన్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుంది.

199 సార్లు భూకంపాలు

గోదావరి పరీవాహక ప్రాంతంలోని భద్రాచలంతో పాటు పలు ప్రాంతాలు భూకంప జోన్‌లోనే ఉన్నాయి. మరోరకంగా చెప్పాలంటే ఈ ప్రాంతమంతా డేంజర్ జోన్‌లోనే ఉంది. ఈ విషయాన్ని గతంలోనే శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గత 56 ఏళ్లలో 199 సార్లు భూకంపాలు ఈ ప్రాంతంలో వచ్చినట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. 1969 ఏప్రిల్ 13న గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని పర్ణశాలలో వచ్చిన భూకంపం రెక్టారు స్కేలుపై 5.5గా నమోదైంది. 2018 ఆగస్టు 15న ప్రకంపన తీవ్రత 3.8గా నమోదైనట్లు ఆనాడు సిస్మోగ్రాఫ్ పరికరం ద్వారా తెలిసిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మళ్లీ ఆరేళ్ల తరువాత భూ ప్రకంపనాలు రాగా అవి సాధారణస్థాయిలోనే రావడంతో ప్రభావం స్వల్పంగానే ఉంది. తాజాగా 2024 డిసెంబరు 4న (మిగతా 6వ పేజీలో)



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

జమలాపురంలో వైభవంగా ధ్వజారోహణం

- బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు రుద్రహోమం
- మయూర వాహనంపై శ్రీవారి గిరిప్రదక్షిణ

6



మాట్లాడుతున్న సీఎండీ బలరాం నాయక్

గ్లోబల్ సంస్థగా ఎదుగుతున్న సింగరేణి

- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సత్తుపల్లి గనుల రికార్డ్
- సీఎండీ బలరాం నాయక్

'ఉపాధి' కూలీలకు భరోసా

- రోజువారీ వేతనం రూ.307కు పెంచుతూ ఆదేశాలు
- నేటి నుంచి అమల్లోకి రానున్న నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 5.38 లక్షల మంది కూలీలకు లబ్ధి


అశ్వారావుపేట రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించి పేదలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో కేంద్రం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఏళ్లుగా ఉపాధిహామీ పథకం లక్షలాది కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు కూడా చాలావరకు అయిపోవటంతో పేదలకు ఉపాధిహామీ పనులే ఆధారంగా ఉంటున్నాయి. పేదలతో పాటు మధ్య తరగతి కుటుంబాలు కూడా పనులకు వస్తుండటంతో ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతుండగా కూలీలు అదే రీతిగా పనులకు వస్తున్నారు. పెరుగుతున్న ఖర్చులు, పేదలకు మరింతగా ఆర్థిక చేయూత అందించేందుకు కూలీలకు ఇచ్చే వేతనాన్ని ఏటేటా కొంత పెంచుతూ వస్తుంది కేంద్రం. తాజాగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.7 అదనంగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు వారం రోజుల క్రితం జారీ చేసింది. పెరిగిన వేతనాలు ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. పెరిగిన వేతనంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 5.38 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరుతుంది.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

రూ.300 నుంచి రూ.307కు....

రాష్ట్రంలో పనిచేసే ఉపాధి హామీ పథకం 2005లో ప్రారంభం కాగా అప్పట్లో రోజువారి వేతనం రూ.87.50 చెల్లింపులు చేశారు. పదేళ్ల క్రితం ఈ వేతనం రూ.193కాగా ప్రస్తుతం రోజువారి వేతనం రూ.300గా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు ఇదే వేతనాలను చెల్లించారు. ఇపుడు రోజువారి వేతనాన్ని మరో రూ.7పెంచి దినసరి వేతనాన్ని రూ.307గా నిర్ణయించారు. పెంచిన వేతనం 2025-26 ఆర్థిక సంవత్సరం (మిగతా 6వ పేజీలో)



'కోర్టు' హీరో మనోడే...

- రోషన్ స్వస్థలం భద్రాచలం
- చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తి
- తండ్రి ప్రోత్సాహంతో సినిమా రంగంలోకి ఎంట్రీ
- సినిమా విజయంపై భద్రాద్రి వాసుల హర్షం

6

భూభారతి... రైతులకు వరం

- సాదా బైనామాలకు మోక్షం
- రెవెన్యూ ట్రిబ్యునల్‌కు అవకాశం
- పాస్ పుస్తకాలు నేరుగా రైతుల ఇంటికే
- ఆంధ్రజ్యోతితో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భూరికార్డుల నిర్వహణలో పారదర్శకత, సమర్థతను పెంచడానికి ప్రభుత్వం భూభారతి త్వరలో అమలులోకి రానుందని జిల్లా అదనపు కలెక్టర్ పినరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌తో ఉన్న చట్టంలో కొన్ని లోపభూయిష్టమైన ఇబ్బందులున్నాయని వాటన్నింటినీ సరిచేస్తూ పూర్తిగా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా భూభారతి చట్టం రాబోతోందన్నారు. దీంతో జిల్లాలో పేరుకుపోయిన భూసమస్యలన్నింటికీ మోక్షం కలగనుందని ఆయన తెలిపారు. ఏళ్ల తరబడి భూహక్కులు, పేర్ల తప్పులు సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్న రైతులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. ఆంధ్రజ్యోతితో ఆయన తెలిపిన వివరాలు ఇలా :

అందుబాటులోకి రెవెన్యూ సేవలు...

ధరణి పోర్టల్‌తో గ్రామాల్లో అనేక భూ సమస్యలకు ఇబ్బందులు వచ్చిపడ్డాయి. భూసమస్యల పరిష్కారానికి కాస్త జాప్యం కూడా జరిగింది. కొత్తగా వచ్చే భూ భారతితో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం కానున్నాయి. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్ పరిధిలో 380 రెవెన్యూ గ్రామాల్లో మళ్లీ రెవెన్యూ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

గ్రామానికో అధికారి...

ఇప్పటి వరకు భూ సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో అధికారులు లేకపోవడం కూడా ఒకింత జాప్యానికి కారణం అయ్యింది. ప్రభుత్వం తాజాగా వీఆర్వోలను తిరిగి గ్రామస్థాయి రెవెన్యూ అధికారులుగా తీసుకొనున్నారు. వీటిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. వీరి నియామకం అయితే పల్లెల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే ఆస్కారం ఉం టుంది. భూ పట్టాలు, రికార్డుల నిర్వహణ, సరిహద్దు వివాదాలు, ధ్రువపత్రాల జారీ, విపత్తుల సాయం, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక వంటివి వారు నిర్వహించనున్నారు. పల్లెపాలన మెరుగుపడుతుందని తద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

సాదా బైనామాలకూ మోక్షం...!

లిఖితపూర్వక ఒప్పందాలతో భూములు కొనుగోలు చేసిన అన్నదాతలకు భూభారతి చట్టంతో వెసులుబాటు కలగనుంది. తెల్లకాగితం ద్వారా ఒప్పందాల (సాదా బైనామా) ద్వారా జూన్ 2, 2014 కు ముందు జరిగిన భూ కొనుగోళ్లను క్రమబద్ధీకరించాలని కొత్త చట్టం చెబుతోంది. సాదా బైనామాల ద్వారా రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. జిల్లాలో మొత్తంగా 1,11,443 దరఖాస్తులు రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దారు స్థాయిలో కాకపోతే ఆర్డీవో అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. మ్యుటేషన్లకు సంబంధించి అర్జీదారుల కుటుంబ సభ్యులకు తహసీల్దారు నోటీస్ జారీ చేసి విచారణ చేపట్టే అవకాశం కూడా ఉంటుంది. ఈ చట్టంతో భూసమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా మాడ్యుల్స్ రాబోతున్నాయి. తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ ఆతర్వాత సీసీఎల్ఏ స్థాయిలో సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది.



పాసు పుస్తకాలు నేరుగా అన్నదాతల ఇంటికే...!

భూముల రిజిస్ట్రేషన్లు మండల తహసీల్దారు కార్యాలయాల్లోనే కొనసాగుతున్నాయి. ఒక్కో మండలంలో కనీసం 5 నుంచి 10 వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అయిన ప్రతి రిజిస్ట్రేషన్‌కు పోర్టల్ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్నాం. అయితే పాసు పుస్తకం ముద్రణ మాత్రం చెన్నైలో ముద్రితం కావాల్సి ఉంటుంది. ఈ ప్రింటింగ్ అయిన తర్వాత వాటిని నేరుగా రైతుల ఇళ్లకే పోస్టు ద్వారా పంపిస్తున్నాం. పాస్ పుస్తకాల పంపిణీ జాప్యం అవుతుంది అని ప్రశ్నించగా.. ధరణి సైట్ నిర్వహణ కారణంగా ఏమైనా జాప్యం జరుగుతుందోమో.. దీనిపై విచారిస్తామన్నారు.

జిల్లా వివరాలు ఇలా :	
ఖమ్మం రెవెన్యూ డివిజన్‌లో గ్రామాలు	:276
కల్లూరు రెవెన్యూ డివిజన్‌లో గ్రామాలు	:104
మొత్తం	:380
జిల్లాలో సాదా బైనామాల పెండింగ్ దరఖాస్తులు	1,11,443

జిల్లాలో ధరణిలో పెండింగ్ దరఖాస్తులు

డివిజన్	తహసీల్దార్ల వద్ద	ఆర్డీవోల వద్ద	అదనపు కలెక్టర్ వద్ద	కలెక్టర్ లాగిన్‌లో
ఖమ్మం	1086	444	632	404
కల్లూరు	456	185	209	224
మొత్తం	1542	629	841	628




మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పాల్గొన్న ఐటీడీఏ పీవో రాహుల్

రాజీవ్ యువ వికాసానికి అధిక దరఖాస్తులకు కృషి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

భద్రాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులైన యువకులు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఈ పథకం అమలు ద్వారా నిరుద్యోగం తగ్గుతుందని, అర్హులైన వారు ఏప్రిల్ 14 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలలోపు ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఆదాయం ఉండాలన్నారు. అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటిని మునిసిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అక్కడి సిబ్బందితో ఫిజికల్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

వినాయకపురంలో భక్తజనం

- జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నాలుగు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్
- ముగిసిన ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు



అశ్వారావుపేట రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని వినాయకపురంలో గల ముత్యాలమ్మ ఆలయం భక్తజనంతో పులకించింది. వరుసగా మూడు రోజులపాటు సెలవులు రావటంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం రాత్రి భక్తుల రద్దీ అధికం కావడంతో ఊహించని విధంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. జాతర ఆఖరి రోజు సోమవారం రాత్రి కూడా ప్రజలు భారీగా తరలిరావటంతో వినాయకపురం భక్తజన సంద్రంగా మారింది. ఊట్లపల్లి, ఆనుపాక వైపు ఐదు కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో రెండు మూడు గంటల పాటు వాహనాలు ముందుకు కదలలేదు. సీఐ కరుణాకర్, ఎస్ఐ యయాతిరాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాలను ముందుకు కదిలించారు. జాతర ఆఖరిరోజు సోమవారం ముత్యాలమ్మ తల్లి.. తలుపులమ్మ తల్లి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భారీగా క్యూకట్టారు. గంటల తరబడి నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో సోమవారం రాత్రి ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సూర్యప్రకాశరావు, ఆలయ కమిటీ చైర్మన్ నరాల శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2 నుంచి 6 వరకు మధురైలో...

సీపీఎం అఖిల భారత మహాసభలు

జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 2 నుంచి 6వ వరకు మధురైలో సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలు జరుగుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మహాసభలకు ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర బాధ్యతల్లో కీలకంగా ఉన్న పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాచర్ల భారతి హాజరవుతారని తెలిపారు. ఖమ్మం నుంచి రెడ్ షర్టు వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

త్వరలో అర్చకుల రాష్ట్రస్థాయి సమావేశం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అర్చకుల సమస్యలను తెలుసుకొని త్వరలో రాష్ట్రస్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి అర్చకుల సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తామని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీఎస్ శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం నగరంలోని కమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చక, ఉద్యోగుల డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా ఖమ్మంలో డైరీ ఆవిష్కరణ జరిగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,062 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించామన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి, రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వేణుగోపాలాచార్యులు, ఆలయ స్థానాచార్యులు శేషభట్టార్ రఘునాథాచార్యులు, అర్చకులు మధుసూదనాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోటమైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కారేపల్లి మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయంలో మూడు రోజులపాటు జరగనున్న పవిత్ర బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, డాక్టర్ విజయలక్ష్మీ దంపతులు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ పూజారి కైలాష్ శర్మ, ఈవో వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు పట్టణానికి చెందిన మార్గదర్శి విద్యా సంస్థల ప్రతినిధి ఆర్వపల్లి రాధాకృష్ణ, కార్యక్రమం కన్వీనర్ తాటిపల్లి సుబ్బారావు, కడవెండి వేణుగోపాల్ గుప్త, ఆలయ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సాసాయి జనార్ధన్ రావు, మధుబాబు, సురేష్, సతీష్, రాజశేఖర్, చక్రధర్, రవికిరణ్, సత్యేంద్రప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గ్లోబల్ సంస్థగా సింగరేణి

- ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణి బొగ్గు గనులు
- సింగరేణి సీఎండీ బలరాం నాయక్

సత్తుపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గ్లోబల్ సంస్థగా అందరి సహకారంతో ఎదుగుతోందని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం నాయక్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ మన రాష్ట్రంలోనే కాకుండా ఆస్ట్రేలియా సహా మరికొన్ని దేశాల్లో బొగ్గు గనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఒడిసాలో 10 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన బొగ్గు గనులను ప్రారంభించనున్నామని అన్నారు. 3100 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి కోసం రాజస్థాన్‌తో ఒప్పందం జరిగిందని వెల్లడించారు.

ఇల్లందు సమీపంలో రొంపేడు, కొత్తగూడెం గౌతంఖని ఓపెన్ కాస్టులు త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు. సింగరేణి పరిధిలోని అన్ని ఏరియాలో కంటే కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లిలో ఉన్న బొగ్గు గనుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి, రవాణాలో లక్ష్యాన్ని మించి రికార్డు సృష్టించినట్లు ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీల నుంచి 144.18లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని, గతేడాది 138లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. అదేస్థాయిలో బొగ్గును రవాణా 162.23 లక్షల టన్నుల రవాణా చేశారని, ఒక్కరోజులో 80,931 టన్నుల బొగ్గును ఉత్పత్తిచేసి రికార్డు సాధించినట్లు తెలిపారు. 3618 రేక్స్ బొగ్గు రవాణా జరగ్గా ఒక్కరోజులో 17 రేక్స్ బొగ్గు రవాణా జరిగిందని, గతంలో కంటే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అయినట్లు తెలిపారు.

ఈ ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తికి సహకరించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. సత్తుపల్లిలో నిర్మించిన జీఎం కార్యాలయాన్ని త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. స్థానిక యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇస్తూ బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని స్పష్టం చేశారు. స్థానికంగా ఐదారువందల లారీలకు బొగ్గు లోడింగ్ ఇచ్చే విషయంపై సానుకూలంగా ఉన్నామని, ఇప్పటికే పార్థసారధిపురం వరకు 10 లక్షల టన్నుల బొగ్గు రోడ్డు మార్గంలో తరలిస్తున్నామని, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు బొగ్గు రవాణా రోడ్డు మార్గంలో జరిగే అవకాశం ఉందని అన్నారు. బొగ్గు లక్ష్యంమేరకు ఉత్పత్తికి సహకరిస్తున్న సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా డైరెక్టర్ (పీఅండ్‌పీ) కొప్పుల వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ.సూర్యనారాయణ, కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీవోలు ఎన్‌వీఎస్‌వి.ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు పాల్గొన్నారు.

జమలాపురంలో వైభవంగా ధ్వజారోహణం

ఎర్రుపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం రెండోరోజుకు చేరకున్నాయి. తెల్లవారుజాము నుంచే శ్రీవారికి సుప్రభాతసేవ, ప్రాతఃకాల అర్చన, శ్రీపాదమునకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం గోపూజ, యాగశాలలో బలిహరణ గావించారు. వేదమంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిద్యాలు మోగుతుండగా అర్చకులు ఆలయ ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఎగురవేసి ధ్వజారోహణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ మాట్లాడుతూ సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సప్త మూర్తులను, రుషిగణాన్ని, సకల ప్రాణకోటిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ గరుడ స్వామి ధ్వజ స్తంభాన్ని అధిరోహిస్తారన్నారు. విశ్వమంతా గరుత్మంతుడు వ్యాపించి ఉంటాడని పురాణాలు చెబుతున్నాయని, ఆయణ్ను శ్రీనివాసుడి వాహనంగా చేసుకోవడంతో సర్వాంతర్యామిగా శ్రీవారు కీర్తించబడుతున్నాడని తెలిపారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు వసంత నవరాత్రులలో రెండోరోజు రుద్రహోమం నిర్వహించారు. అనంతరం డప్పువాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు మయూర వాహనంపై గిరిప్రదక్షిణ చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయ కుమారి, గరుడాలయ నిర్మాణ దాత మూల్పూరి శ్రీనివాసరావు, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహనశర్మ, వేదపండితులు, గ్రామస్థులు తదితరలు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలకు భరోసా



(5వ పేజీ తరువాయి)

ఆరంభం నుంచి అమలు చేయనున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌తో మరో మూడు రాష్ట్రాల్లోనూ ఇదే వేతనాన్ని కూలీలకు ఇవ్వనున్నారు. కూలీల జీవనోపాధి భద్రతను మెరుగపరచటమే లక్ష్యంగా కేంద్రం ఈ చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రతి గ్రామీణ కుటుంబం వంద రోజులు పనులు చేసుకునేలా మరింతగా ప్రోత్సాహం అందిస్తుంది. ఏడాది పొడవునా కూలీలు పనులు చేసుకుని అధిక వేతనం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

5.38 లక్షల మంది కూలీలు

పెరిగిన వేతనాల వల్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 లక్షల మందికిపైగా కూలీలకు లబ్ధి చేకూరుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 22 మండలాల్లో 481 గ్రామ పంచాయతీల్లో 2.23 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. వీటిలో 4.59లక్షల మంది కూలీలు ఉన్నారు. ఆయా జాబ్ కార్డుల్లో 1.36 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉండగా.. అందులో 2.3లక్షల మంది కూలీలు పనులు చేస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రోజువారి కనీస వేతనం రూ.222.71గా ఉంది. జిల్లాలో 2325 కుటుంబాలు వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. ఖమ్మం జిల్లాకు సంబంధించి 20మండలాల్లో 589 పంచాయతీల్లో 3.06 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. అందులో 1.83 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. జాబ్‌కార్డుల్లో 6.43 లక్షల మంది కూలీలు నమోదు కాగా 3.08 లక్షల మంది పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో దినసరి వేతనం సరాసరి 210.23 చెల్లింపులు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా దాదాపు రూ.386 కోట్లతో అన్ని రకాల పనులు, నిర్మాణాలు చేపట్టారు. అత్యధికంగా కూలీల వేతనాలకే ఖర్చు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజు ప్రతి పంచాయతీ నుంచి కనీసం 100మందికి తగ్గకుండా కూలీలు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక కూలీల కొరకు సులభమైన పనులను ఎంపిక చేస్తున్నారు. పూడికతీత, ఫారంపాండ్‌లు, కాల్వల నిర్మాణం, నీటి గుంటల నిర్మాణాలను ముమ్మరంగా చేయిస్తున్నారు.

‘గిరి’ వికాసమేదీ?

(5వ పేజీ తరువాయి)

యూనిట్లు అసంపూర్తిగా ఉండగా కొత్త యూనిట్ల కోసం దరఖాస్తు చేసిన వారికి మోక్షం లభించడంలేదు.

భద్రాచలం ఐటీడీఏతో పాటు కొత్తగూడెం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో కూడా గిరివికాసం పథకం కింది గిరిజన రైతుల నుంచి 2వేలపైగా దరఖాస్తులు వచ్చాయి. అటవీ భూముల హక్కు పత్రాలున్న రైతులు సైతం తమకు సోలార్ పంపుసెట్లు కావాలని, బోర్లువేయాలని.. దరఖాస్తు చేసినా నిధులు లేకపోవడంతో ఈ పథకం నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూముల అభివృద్ధే లక్ష్యంగా పోడుసాగుదారులకు గిరి వికాసం కింద నిధులు కేటాయించి బోర్లు, మోటార్లు కేటాయిస్తే పోడుభూములు సాగుభూములుగా సస్యశ్యామలమయ్యే అవకాశం ఉంది. ఆయిల్‌పామ్ సాగుకూడా అటవీభూములు అనువుగా ఉండడంతోపాటు పచ్చదనం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ పథకానికి నిధులు కేటాయించి సాగునీటి సౌలభ్యం కల్పించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

పండుగ వేళ పెను విషాదం

(5వ పేజీ తరువాయి)



తండ్రి, కుమారుడి మృతదేహాలు

కొందరు వీరిని కాపాడే ప్రయత్నం చేసినా వారు అప్పటికే మునిగిపోయారు. కరీముల్లాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా తండ్రి యూసఫ్ ఖాన్ మానసిక స్థితి సక్రమంగా లేనందున ఇంటి గేటు తీసుకొని చెరువు వైపు వెళ్లగా తండ్రిని తీసుకొచ్చే క్రమంలో కుమారుడు కూడా చనిపోయాడని గ్రామంలో చర్చ జరుగుతోంది. కుటుంబ సభ్యులు మాత్రం గేదే కోసం తండ్రి వెళ్లగా, చెరువులో తండ్రిని కాపాడే ప్రయత్నంలో కుమారుడు కూడా మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

‘కోర్టు’ హీరో మనోడే..

- రోషన్ స్వస్థలం భద్రాచలం
- చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తి
- సినిమా విజయంపై భద్రాద్రి వాసుల హర్షం

భద్రాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హీరో నాని తాజాగా నిర్మించిన ‘కోర్టు’ సినిమాలో హీరోగా నటించిన రోషన్ భద్రాచలం వాసి కావడంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రోషన్ కొన్నేళ్లుగా పలు సినిమాల్లో నటిస్తున్నాడు. కోర్టు సినిమా విజయం సాధించడంతో భద్రాచలంలోని స్నేహితులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తక్కువ బడ్జెట్‌తో తీసిన సినిమా రూ.50కోట్లపైగా ఆదాయాన్ని సాధించటం చర్చనీయాంశంగా మారింది. భద్రాచలంలోని కాంట్రాక్టర్ అలీమ్‌ఖాన్ వద్ద రోషన్ తండ్రి రషీద్ అకౌంటెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. తన కుమారుడి టాలెంట్‌ని చిన్న వయసులోనే ఆయన గుర్తించారు. భద్రాచలంలో నాలుగేళ్లపాటు డాన్స్‌లో శిక్షణ ఇప్పించారు. రోషన్‌ని ఉన్నత స్థాయిలో చూడాలనే ఆశయంతో రషీద్ తన కుమారుడిని హైదరాబాద్‌కు పంపి నటనలో మెళకువలు నేర్పించారు. కోర్టు సినిమాలో రోషన్‌కు అవకాశం రావటం... సినిమా విజయవంతం కావటంతో భద్రాద్రి వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సినిమాలో రోషన్ నటన అద్భుతంగా ఉందని కితాబునిస్తున్నారు. మరిన్ని సినిమాల్లో నటించి భద్రాచలం కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. కాగా, రోషన్‌ను టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ సోమవారం అభినందించారు. కోర్టు చిత్రంలో నటించి అందరి మన్ననలను, అభినందనలు అందుకుంటున్న రోషన్ ను హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి ఆహ్వానించి చిరు సత్కారం, అభినందనలు తెలిపారు. అలాగే సినిమా సక్సెస్ అయినందుకు కేక్ కట్‌చేసి వారితో తమ ఆనందాన్ని పంచుకున్నారు.

భూకంప జోన్‌లో భద్రాచలం

(5వ పేజీ తరువాయి)

ఈ ప్రాంతంలో భూకంపం స్వల్పంగా కంపించడంతో మరోసారి భూకంపాలపై చర్చ సాగింది. భూకంపం ఏర్పడే ప్రాంతాల జోన్-3లో భద్రాచలం ఉంది. జోన్-3 (0.125 గ్రావిటి)లో తీవ్రత ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ జోన్ పరిధిలో కీలక నగరాలైన లక్నో, పాట్నాలోని కొన్ని ప్రాంతాలు రాంచీ, భువనేశ్వర్, డామన్, ముంబై, ఏపీలోని అమరావతి, తెలంగాణలోని భద్రాచలంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు ఉన్నాయి. అయితే గతంలో ఈ జోన్‌లో తీవ్రత 0.15 గ్రావిటీ ఉండగా ఇటీవల కాలంలో 0.125 గ్రావిటీగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో భూకంపాలు స్వల్పంగానే వచ్చే అవకాశాలున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇటీవల నగరాలు, పట్టణాల్లో బహుళ అంతస్తు నిర్మాణాల్లో సంబంధిత యజమానులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ లాంటి మహానగరంలో కార్పొరేషన్ అధికారులు బిల్డింగ్ కోడ్‌ను అమలు చేస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగు సిబ్బంది స్ట్రక్చరల్ ఇంజనీరింగు టెస్టును నిర్వహించి మాత్రమే నిర్మాణాలకు అనుమతి ఇస్తున్నారు. ఇదే రీతిలో భద్రాచలం పంచాయతీ అయినప్పటికీ ఎటువంటి సాంకేతికపరమైన అధునాతన పరీక్షను నిర్వహించిన అనంతరమే బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతి ఇస్తే మంచిదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఘనంగా రంజాన్ వేడుకలు

- గొల్లగూడెం ఈద్గాలో పాల్గొన్న మంత్రి తుమ్మల
- ముస్లింలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని గొల్లగుడెం ఈద్గాలో సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ముస్లిం వ్యతిరేక చట్టాలను అడ్డుకుంటామని, అన్ని కులాలకు, మతాలకు సమానమైన హక్కులు కాపాడటంలో ఈ ప్రభుత్వం ముందుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే వక్ఫ్ చట్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వ్యతిరేకించారని అన్నారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నూతన దుస్తులు ధరించి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఖమ్మం నగరంలోని గొల్లగుడెం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో మంత్రి తుమ్మలతోపాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మం గాంధీచౌక్ ఈద్గాతోపాటు నగరంలోని వివిధ మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్నేహితులకు, బంధువులకు సేమ్యా పాయసాన్ని పంచిపెట్టారు.


జగ్గారం గ్రామంలో సమావేశమైన గిరిజన భూనిర్వాసితులు

మా భూములు ఇచ్చేయండి

- సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల ఆందోళన
- పరిహారం ఇవ్వకుండానే స్వాధీనం చేసుకున్న అధికారులు
- జగ్గారంలో గిరిజన రైతుల సమావేశం

దమ్మపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి సేకరించిన రైతుల భూములను తిరిగి రైతులకు స్వాధీనం చేయాలంటూ గిరిజన రైతులు జగ్గారం గ్రామంలో సోమవారం ఒక తోటలో సమావేశమయ్యారు. జగ్గారం గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి 2019సంవత్సరంలో 124 మంది రైతుల నుంచి 103.07ఎకరాల భూమిని గ్రామసభ ద్వారా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూసేకరణ జరిగిన .ఇప్పటి వరకు సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణం ప్రారంభించక పోగా , రైతులకు ఆరు సంవత్సరాలైన నేటి వరకు పరిహారం చెల్లించ లేదు. రెవెన్యూ అధికారులు మాత్రం భూసేకరణ జరిగినట్టు రివెన్యూరికార్డుల నుంచి ఆయా రైతుల నుండి పట్టా కాలంలో భూములను తొలిగించారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని గిరిజ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల రికార్డులనుంచి భూములు తొలిగించటంతో రైతుబంధుతో పాటు, ఆరు సంత్సరాలుగా ఆభూముల నుంచి వచ్చే ఆదాయం రైతులు కోల్పోటంతో పాటు బ్యాంకుల నుంచి రుణం కూడా రావటంలేదని వాపోయారు. ఆభూముల్లో ఉన్న జీడి చెట్లను తొలిగించటంతో తాము ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా సేకరించిన భూములను రైతులకు తిరిగి స్వాధీనం చేయాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అవసరమైతే ప్రాజెక్టు కోసం తాము భూములు ఇవ్వటానికి సిద్ధమేనని గతంలో చేసిన భూసేకరణ రద్దు చేసి నూతనంగా భూసేకరణ చేపట్టాని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరం లేకుంటే తమ భూములను రైతులకు స్వాదీనం చేయాలని నీటి పారుదల అధికారులకు విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వం గిరిజన రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఈసమావేశంలో గిరిజన రైతులు ఆదివాసీ సంఘం నాయకులు కారం శ్రీరాములు, కల్లూరి రాజేష్, కుర్సం చిన్న రాజులు, కారం నాగేశ్వరరావు, వంకా ముత్యాలరావు, ఊకే రాంబాబు, మడకం నాగేశ్వరరావు, కొమరం రాము, కారం నాగరాజు, పాయం శీతారాములు, మడివి బొజ్జి తదితరులు ఉన్నారు.



600కి.మీ. సైక్లింగ్ పూర్తిచేసిన సందర్భం

పోలీసు శాఖలో చురుగ్గా విధులు నిర్వహిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీంద్ర రెడ్డి.. రన్నింగ్, సైక్లింగ్ విభాగాల్లో సత్తా చాటుతున్నారు. ఆయా ఈవెంట్లలో పాల్గొని నిర్దేశిత లక్ష్యాలను సమర్ధవంతంగా పూర్తి చేసి ప్రతిష్టాత్మకమైన మైలురాళ్లను కైవసం చేసుకుని ఫుల్ ఐరన్ మేన్, సూపర్ ర్యాండర్‌గా గుర్తింపు పొందారు. యువత ఆరోగ్యంగా ఉండటంతో పాటు వ్యసనాల బారిన పడకుండా ఫిట్‌నెస్ ఈవెంట్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణతో పాటు విదేశాల్లో జరుగుతున్న ఈవెంట్లలో పాల్గొని సత్తా చాటుతున్నారు. వయసు కేవలం శరీరానికే అని మనసుకు కాదని, ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని అంటున్నారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే...

-ఆంధ్రజ్యోతి, మణుగూరు

సైక్లింగ్ కింగ్...



దుబాయ్‌లో మెడల్‌తో

- రన్నింగ్, సైక్లింగ్‌లో పలు రికార్డులు సాధించిన డీఎస్పీ
- ఐరన్ మేన్, సూపర్ ర్యాండో టైటిళ్ల విజేత రవీంద్ర రెడ్డి
- యువత కు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తున్న నాలుగో సింహం

హైద్రాబాద్‌లో సిటీ రేంజ్ వన్ ఇన్‌స్పెక్టర్‌గా సైనిక్‌పురి ఏరియాలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా జిమ్‌కు పోయే అలవాటు ఉండేది. అక్కడ హైద్రాబాద్ రన్నర్ గ్రూప్, సికింద్రాబాద్ రన్నర్ గ్రూప్‌లు ఉన్నాయి. సికింద్రాబాద్ రన్నర్‌గ్రూప్‌లో చంద్రశేఖర్ వైద్యుడి పరిచయంతో రన్నర్ గ్రూప్‌లో చేరాను. అక్కడ నుంచి రన్నింగ్, సైక్లింగ్ జర్నీ ప్రారంభమైంది. జంట నగరాల్లో ఈవెంట్లు ఉన్నా పాల్గొనేవాళ్లం. నాకు శ్రీధర్ అనే మిత్రుడు ఈవెంట్లలో పార్ట్‌నర్‌గా ఉండేవాడు. ఎల్‌బీ నగర్, ఉప్పల్, ఓయూ, అల్వాల్, ఈసీఎల్, గ్రూప్స్‌లో రన్నింగ్ ఈవెంట్స్‌పెడితే అక్కడ నేను పాల్గొనేవాణ్ని


కొండల్లో, గుట్టల్లో పరుగులు..

నగరంలో ఫిబ్రవరిలో నెలలో హాఫ్ మారథాన్ 21 కి.మీ., ఆగస్టులో ఫుల్ మారథాన్ 42 కి.మీ. జరుగుతుంది. 2017లో తొలుత ఆఫ్ మారథాన్ పూర్తి చేశా. 2018 ఆఫ్ ఐరన్ మేన్ ఈవెంట్ హైద్రాబాద్‌లో నిర్వహించారు. ఆఫ్ ఐరన్ మేన్ అంటే 1.8 కి.మీ స్విమ్మింగ్, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21కి.మీ. రన్నింగ్ వరుసగా చేయాలి. ఫుల్ ఐరన్ మెన్ అంటే దీనికి రెట్టింపు దూరాలను చేరుకోవాలి. 2018లో నేను శ్రీకాంత్, శ్రీధర్, ప్రేమ్‌తో కలసి ఆఫ్ ఐరన్ మేన్ ఈవెంట్ పూర్తిచేశాం.

రాండోనేస్ అనే సంస్థ హైద్రాబాద్‌లో సైక్లింగ్ ఈవెంట్స్ నిర్వహించేది. మరో రెండు సంస్థలు కూడా 200కి.మీ., 300, 400, 600 కి.మీ., విభాగాల్లో పోటీలు నిర్వహించేవారు. ఒకే ఏడాదిలో ఈ నాలుగు విభాగాలను పూర్తి చేస్తే వారిని సూపర్ ర్యాండోనేర్ అంటారు. 2018లో నేను సూపర్ ర్యాండోనేర్‌గా గుర్తింపును సాధించా.

పలు సందర్భాలల్లో సికింద్రాబాద్‌నుంచి ప్రగ్నాపూర్ వరకు, హైద్రాబాద్ నుంచి జడ్చర్ల కృష్ణా సరిహద్దు వరకు, హైద్రాబాద్‌నుంచి నిర్మల్, నిర్మల్ నుంచి హైద్రాబాద్‌కు సైక్లింగ్ చేశా. 600 కిలోమీటర్ల విషయానికి వస్తే హైద్రాబాద్‌లో ఆరంబించి జనగాం, వరంగల్, ములుగు, లక్నవరం, లక్నవరం నుంచి తిరిగి మల్లంపల్లి, నర్సంపేట్, ఇల్లెందు ఖమ్మం, కోదాడ, సూర్యాపేట మీదుగా హైద్రాబాద్‌కు చేరుకున్నాం. ఇవే కాకుండా నేను రెండు ఫుల్ మారథాన్‌లు 2018లో హైద్రాబాద్‌లో పూర్తి చేశాను. 2020లో దుబాయి వెళ్లి అక్కడ ఫుల్ మారథాన్ చేశా. ప్రతీ సంవత్సరం 10కే రన్ రన్‌నిర్వహిస్తున్నాం.

సింగరేణి ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి

- వైద్యరంగానికి సింగరేణి అధిక ప్రాధాన్యం
- ఏడాదికి కార్మికులు, ఉద్యోగుల వైద్యం కోసం రూ.500కోట్లు
- సింగరేణి సీఎండీ ఎన్. బలరాం


నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆసుపత్రుల ఆధునికీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సింగరేణి వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం చేయకుండ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలని కోరారు. సింగరేణి యాజమాన్యం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఏడాదికి సింగరేణి కార్మికులు, ఉద్యోగుల వైద్యసేవలకు సుమారు రూ. 500కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. సింగరేణి ఆసుపత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్రాలను సైతం ఉపయోగిస్తున్నామని, వైద్యులు రోగులను ఇతర ఆసుపత్రులకు రిఫరల్ చేసే విధానాన్ని తగ్గించుకుని సింగరేణి ఆసుపత్రిలోనే మెరుగైన సేవలు అందించాలన్నారు. రోగులకు నమ్మకం కలిగించేవిధంగా వైద్యసేవలు ఉండాలన్నారు. రామగుండం ఏరియాలో 100పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు చేపడుతున్నామని, సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఆసుపత్రుల్లో అన్నిరకాల స్పెషలిస్టులను నియమించి వారి ద్వార వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో పని చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కోరారు. త్వరలో బీఎస్సీ నర్సింగ్ కోర్సులను సైతం ప్రవేశపెట్టే విదంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రుల్లో సిటిస్కాన్, ఎంఆర్ఐ స్కాన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైద్యరంగంలో నర్సింగ్‌విద్యార్థులు అందిస్తున్న సేవలు అభినందనీయమని, దేశ విదేశాల్లో నర్సింగ్‌రంగానికి ప్రాధాన్యత ఉందన్నారు. నాణ్యతతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా సింగరేణి నర్సింగ్ కళాశాల పనిచేయాలని కోరారు. వైద్యులు, వైద్య సిబ్బంది సింగరేణి ప్రతిష్టను మరింత పెంచడంతోపాటు సింగరేణి సమీప ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్లు, ఎల్‌వి. సూర్యనారాయణ, జనరల్ మేనేజర్లు కవితానాయుడు, సూర్యనారాయణ, దామోదర్‌రావు, చింతల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కార్మిక నాయకులు త్యాగరాజన్, రమణ మూర్తి, సీఎంవో సుజాత, అడిషనల్ సీఎంవో డాక్టర్ ఉషా, డీజీఎంలు రాజీవ్‌కుమార్, డాక్టర్ సునీల, మాలతి, రాజశేఖర్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న పీవో

గిరిజన మ్యూజియంను అందంగా తీర్చిదిద్దండి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమికి వచ్చే ప్రముఖులందరూ గిరిజన మ్యూజియాన్ని తిలకించే అవకాశం ఉన్నందున ప్రముఖులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను ఆయన సందర్శించారు. మ్యూజియంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన వివిధ కళాఖండాలను, పెయింటింగ్ చిత్రాలను, చివరి దశలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన వంటకాల కోసం నిర్మాణం చేపడుతున్న స్టాల్స్ త్వరగా పూర్తిస్థాయిలో నిర్మించాలన్నారు. సందర్శకులు కూర్చోవడానికి టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజు, ఏపీవో వేణు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

- అలరించిన శతక పద్య అవధానం
- బాల అవధానులకు సత్కారం


బాల అవధానులను సత్కరిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి సత్తుపల్లి పట్టణ శివారులోని శ్రీ గాయిత్రి శ్రీ లలితా సమేత జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం, వేమన శతక అవధానం ఆహుతులను అలరింపజేసింది. కవి సమ్మేళనంలో పలువురు కవులు సామాజిక అంశాలు నేపథ్యంగా కవితలు, గేయాలు, పద్య రచనలను ఆలపించారు. అశాంతి, హింస, చిన్నారులపై హత్యాచారాలు, పర్యావరణం, సంస్కృతీ, సంప్రదాయాలు, వర్తమాన రాజకీయాలపై రాసిన కవితలు ఆహుతులను అలోజింపజేశాయి. కవి సమ్మేళనంలో పీవీ రమణమూర్తి, చిమ్మపూడి కల్యాణశర్మ, పీవీఎస్ మల్లికార్జున రావు, ఆర్‌వీ రమణమూర్తి, సత్యసాయిరాం, శేషాచార్యులు, సోమరాజు శివరామ్‌ప్రసాద్, మాదిరాజు మాలతి, అయ్యదేవర శేషగిరిరావు, గీతాకుమారి, రమణారావు, మధుసూదనరాజు తదితరులు తమ కవితా పఠనం చేశారు.

అలరించిన శతక పద్య అవధానం

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఆవుల పోతురాజు, కడమంచి వంశీ వేమన శతకంపై అష్టావధానం చేశారు. ఎనిమిది అంశాలలో పృచ్ఛకులసమస్యలకు శతక పద్యాల ఆధారంగా సమాధానాలు చెప్పి మెప్పించారు. ఉపాధ్యాయులు రమాదేవి, రజనీదేవీల ఆధ్వర్యంలో ఈ అవధాన ప్రదర్శన జరిగింది. కవులను, శతక పద్య అవధానులను శాలువాలతో సత్కరించారు. చివరగా బూర్గుల రవిశాస్త్రి విశ్వావసు ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగం శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కొడిమెల అప్పారావు, ఎస్ఎల్‌నరసింహారావు, మాదిరాజు పుల్లారావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి

దమ్మపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన కొమ్ముగూడెం గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పాయం వెంకటేష్(45) కూలి పనులతో పాటు, పాడైపోయిన మోటర్లను బోరుబావి నుంచి తీసే పనులు చేస్తుంటాడు. ఈక్రమంలో మల్కారంలో గ్రామంలో బోరు మోటర్ బయటకు తీసే పని పూర్తి చేసుకొని కొమ్ముగూడెంలోని ఇంటికి మధ్యాహ్నం బయలు దేరాడు. ఈ క్రమంలో కొమ్ముగూడెం గ్రామ సమీపంలో సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన చేకుర్తి సాయి, మరొక వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై దమ్మపేట వస్తుండగా అదుపు తప్పి ఎదురగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈఘటనలో వెంకటేష్ తలకు బలమైన గాయం కావటంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈప్రమాదంలో చేకుర్తి సాయితో పాటు మరొక వ్యక్తి కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో సత్తుపల్లి వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. మృతుడి భార్య వెంకటమ్మ దమ్మపే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్‌కు గాయాలు


కూరాకులను పరామర్శిస్తున్న నామ నాగేశ్వరరావు

రఘునాథపాలెం/ ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం ఉదయం ఖమ్మం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య సత్తుపల్లి, కాకర్లలో పలు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు తన కారులో బయలుదేరారు. వైరా రోడ్డులో వెలుగుమట్ల ప్రాంతంలో యూటర్న్ వద్ద ఆకస్మికంగా ఓ గేదె అడ్డు రావటంతో కారు తప్పించిబోయి ప్రమాదానికి గురైంది. దీంతో వాహనంలో ఉన్న కూరాకుల నాగభూషయ్యతో పాటుగా ఆయన భార్య కూరాకుల యాదమ్మకు స్వల్పగాయాలు అయ్యాయి. దీంతో హుటాహుటిన ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కూరాకులలకు పరామర్శ..

డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య ఆయన సతీమణి యాదమ్మ ప్రయాణిస్తున్న కారు సోమవారం నూతన కలెక్టరేట్ వద్ద రోడ్డుపై ప్రమాదానికి గురికావడంతో స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావులు నాగభూషణం నివాసినికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కూరాకుల వలరాజు, తాళ్లూరి జీవన్ కుమార్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్నేరులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ రాజీవ్ స్వగృహ పరిధిలోని మున్నేరులో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అన్నం శ్రీనివాస్ బృందం సహకారంతో మున్నేరులో ఉన్న మృతదేహన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రెండు రోజుల క్రితం మున్నేరులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతునికి సుమారు 30 సంవత్సరాలు ఉంటాయి. వంటిపై నలుపురంగు పాయింట్ మాత్రమే ఉంది. ఎడమ చెవికి పోగులాంటిది ఉంది. గుర్తు తెలియని మృతదేహం కింద కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

అక్రమ రేషన్ బియ్యం లారీ పట్టివేత

కామేపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అక్రమంగా 600బస్తాలతో తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్న సంఘటన కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో శనివారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై ఎస్ఐ సాయికుమార్ మాట్లాడుతూ పక్క సమచారంతో దాడులు చేసి రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. విచారణ నిమిత్తం సివిల్ సప్లయీస్ అధికారులకు రాత పూర్వకంగా విషయాన్ని తెలియజేశామన్నారు. విచారణ చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఉట్టిపడిన తెలుగుదనం

- రెండో రోజూ కొనసాగిన ఉగాది వేడుకలు


లవకుశ వేషధారణలో చిన్నారులు

పాల్వంచటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ పురస్కరించుకుని పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా రెండో రోజు సోమవారం కొనసాగాయి. వేడుకల సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన జానపద, పౌరాణిక, సాంఘిక వేష పాత్రధారణలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, మాజీ మంత్రి వనమాతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. నంది అవార్డు గ్రహీత, నాటక రచయిత దేవేంద్రను పాల్వంచ కళాపరిషత్ వారు ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ 21 సంవత్సరాలుగా పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను నిర్వహించడం, పలువురు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ బాధ్యులు డాక్టర్ బిక్కసాని సుధాకర్, ముంతపురి రాజుగౌడ్, డాక్టర్ నామా బుచ్చయ్య, డాక్టర్ సూర్యదేవర రామ్మోహన్‌రావు, వేముల కొండలరావు, కేఎల్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ కే. సిద్దార్థరెడ్డి , నామా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

120 కిలోల బెల్లం, పటిక పట్టివేత


నిందితులను చూపుతున్న కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ

జూలూరుపాడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన బెల్లాన్ని, పటిక, నాటు సారాను సోమవారం దాడులు నిర్వహించి ఎక్సైజ్ సిబ్బంది పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసును నమోదు చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ లావుడ్యా జయశ్రీ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని వెంగన్నపాలేనికి చెందిన కిరాణషాపు వ్యాపారి మణికంఠ జూలూరుపాడులో మందనపు సుమన్ ఇంట్లో అక్రమంగా 120కిలోల బెల్లం, 25కిలోల పటికతో పాటు 2.5 లీటర్ల నాటుసారా నిల్వ చేశాడు. సుమన్ ఇంట్లో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించగా అవి పట్టుబడటంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన విలువ రూ.10వేలు చేస్తుందన్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా ఇద్దరు కలసి వ్యాపారం చేస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు.


ఆలయంలో వెంకటేశ్వరరావు

రామయ్య సేవలో ఆడిట్ సంచాలకుడు

భద్రాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ఆడిట్‌శాఖ సంచాలకుడు మార్తినేని వెంకటేశ్వరరావు సోమవారం దర్శించుకున్నారు. లక్ష్మీ తాయారు అమ్మవారిని, ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు సంచాలకుడికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.రామదాసు, పి.కృపాకర్‌రావు, వెంకటేశ్వర రెడ్డి, హుస్సేన్, మాధవి, మమత పాల్గొన్నారు.

లక్ష్యాన్ని మించిన కేఎంసీ ఆదాయం

- చివరిరోజు వసూళ్లతో హైదరాబాద్ తర్వాత ఖమ్మం
- బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.కోటి వసూలు
- ఒకేరోజు రూ.3.62 కోట్లు రికార్డు స్థాయిలో వసూలు
- లక్ష్యం రూ.32 కోట్లు.. వచ్చింది రూ.34.60 కోట్లు



ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆదాయ వసూళ్లలో ఖమ్మం నగర పాలక సంస్థ రెవెన్యూ ఉద్యోగులు కొత్త రికార్డు నమోదు చేశారు. ఒకవైపు లక్ష్యానికి మించిన స్థాయిలో ఏడాది వసూళ్లు చేస్తూనే ఒకేరోజు రికార్డు స్థాయిలో ఆదాయ వసూళ్లు చేపట్టారు. వసూళ్ల చివరి రోజున హైదరాబాద్ మహానగరం తర్వాత ఖమ్మం ద్వితీయ స్థానం పొందింది. ఖమ్మం నగర పాలక సంస్థ గతేడాది రూ.30.40 కోట్లు ఆదాయ వసూళ్లు జరిగాయి. 2024-2025 ఆదాయ వసూళ్ల లక్ష్యం రూ.32 కోట్లుగా రాష్ట్ర పురపాలకశాఖ అధికారులు (సీడీఎంఏ) నిర్ణయించారు. ఈనెలలో జరిగిన బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలోను రూ.32 కోట్లు ఆదాయ వసూళ్లకు అంచనాలు నమోదు చేశారు. ఈ మేరకు నెల రోజులుగా కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ఇతర ఉద్యోగులతో రెవెన్యూ కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తుదిగడువు సోమవారంతో ముగిసింది. కేఎంసీ ఆదాయ వసూళ్ల లక్ష్యం రూ.32 కోట్లు కాగా రూ.34.60 కోట్లు ఆదాయ వసూళ్లు చేశారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకొని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో నోటీసులు పంపిణీ చేయించి ఖమ్మం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి రూ.1 కోటి ఆదాయ వసూళ్లు చేశారు. దీంతో ఒకేరోజు ఆదాయ వసూళ్లు రూ.3.62 కోట్లు జరిగాయి.హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో ఆదాయవసూళ్లు జరిగిన ప్రాంతంగా ఖమ్మం నగర పాలక సంస్థ సరికొత్త రికార్డు సాధించింది. చివరిరోజు కేఎంసీ ఉద్యోగులు రాత్రి 11గంటలకు విధులు నిర్వహించారు. అధిక ఆదాయానికి కృషి చేశారు.

ఈద్ ముబారక్

ఘనంగా రంజాన్ వేడుకలు, పాల్గొన్న మంత్రి తుమ్మల, మేయర్, కార్పొరేటర్లు



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ వద్దిరాజు



డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా కుటుంబ సభ్యులకు అభినందనలు తెలుపుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి31: కులమతాలకు అతీతంగా ప్రజలు సామరస్యంతో జీవించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో ఉపమేయర్ పాతిమాజోహరా నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ దంపతులు పాతిమాజోహరా ముక్తార్ దంపతులను అభినందించారు. కార్పొరేటర్లు రావూరి కరుణ, ఆళ్ల నిరీషారెడ్డి, మందడపు లక్ష్మీ, బిక్కసాని ప్రశాంతి, చిరుమామిళ్ల లక్ష్మీ, గజ్జల లక్ష్మీ, పాకలపాటి విజయనిర్మల, వీవీపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు,పాకాలపాటి శేషగిరిరావు, బెల్లం మనోహర్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు, కాకరవాయి, బీరోలు, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, హైదరసాయిపేట, జింకలగూడెంలో వేడుకలు నిర్వహించారు. పేదలకు అన్నదానం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎస్‌డీ ఇమాం, సైదా, జబ్బార్, బాషామియా, బషీర్, జియావుద్దీన్ పాల్గొన్నారు.



అభినందనలు తెలుపుతున్న మేయర్, కార్పొరేటర్లు

ఖమ్మం రూరల్: మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలను సోమవారం నిర్వహించారు. మద్దులపల్లిలోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోర్లగూడెంలో పాల్గొన్న రాయల

నేలకొండపల్లి:నేలకొండపల్లి, బోదులబండ, కోరట్లగూడెం, చెర్వుమాధారం మజీదుల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యండి.మహబూబ్‌ఆలీ, షేక్.సుభాన్, షేక్. సోందుమియా, షేక్.సోందు, ఆర్‌ఎంపీ, యండి. షాకీర్, ఖాజామియా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.కోరట్లగూడెంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు. షేక్.మైబు ఇంట్లో వేడుకల్లో రాయల పాల్గొన్నారు. కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు పాల్గొన్నారు.



గొల్లగూడెం వద్ద ఈద్గా వేడుకల్లో పాల్గొన్న పువ్వాడ అజయ్ కుమార్



కోర్లగూడెంలో వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల

రంజాన్ వేడుకల్లో ఎంపీ వద్దిరాజు

ఖమ్మం ఖానాపురంహవేలి: రంజాన్ పర్వదినం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం నగరంలోని పలువురు ముస్లింల ప్రముఖుల ఇళ్లను సందర్శించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఖమర్, మునిసిపల్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మక్బుల్, కార్పొరేటర్లు షౌకత్‌అలీ, నాయకులు నజీముద్దీన్, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుబజార్ మదర్సాలో..

నగరంలోని చెరువుబజార్ మదర్సాలో ముక్తి మహ్మద్ జలాలుద్దీన్ ఖాస్మీ ఆద్వర్యంలో ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



మద్దులపల్లిలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



యోగా సాధకులకు సేమియా అందిస్తున్న దృశ్యం



జింకలగూడెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కనులపండువగా శత కలశ స్థాపన



పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు, భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యూపీహెచ్ కాలనీ అభయ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజు మూలవరులకు అష్టోత్తర శతకలశ(108 కలిశములతో) స్థాపన కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, డివిజన్ కార్పోరేటర్ దండా జ్యోతిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు,అర్చకులు నరగిరినాధుని రామాచార్యులు పాల్గొన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సామూహిక కుంకమ పూజ నిర్వహించారు.

దేవాలయం వెనుక శిలాఫలకం!



నేలకొండపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని పైనంపల్లి శ్రీమల్లికార్జునస్వామి దేవాలయం పునఃనిర్మాణం కోసం 2018లో అప్పటి రహదారులు, భవనములు, స్త్రీశిశు సంక్షేమ మంత్రి, ప్రస్తుత వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అప్పటి ఎంపీ, ప్రస్తుత పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు శిలాఫలకంపై ఉన్నాయి. తుమ్మల నాగేశ్వరరావు గుడి పునఃనిర్మాణానికి రూ.50లక్షల నిధులను ప్రత్యేక చొరవతో కేటాయించారు. అయినప్పటికీ దేవాలయ నిర్మాణం పూర్తి అయ్యి దాదాపుగా ఐదేళ్లు అయినా, దేవాలయ నిర్వాహకులకు శంకుస్థాపన శిలాఫలకం పెట్టాలన్న ఆలోచన రాలేదు.

కార్బైడ్ రహిత పళ్లతో ఆరోగ్యం: మేయర్



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): కార్బైడ్ రహిత మామిడి పళ్లతో ఆరోగ్యంగా ఉంటామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. 44వ డివిజన్‌లో సోమవారం మామిడి పళ్ల స్టాల్‌ను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. కాయల నిల్వ తీరును తెలుసుకున్నారు. ఫ్రూట్స్ ప్రజల ఆరోగ్యం మెరుగుపర్చేలా దుకాణాల నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు పాలేపు వెంకటరమణ, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్1లో మెరిసిన కాకరవాయి వాసి

63వ ర్యాంకు సాధించిన కొత్తపల్లి కుశీల్‌శంశీ



తిరుమలాయపాలెం,మార్చి31 (ఆంధ్రజ్యోతి): గ్రూప్1 ఫలితాల్లో ఇఠ మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి కుశీల్‌శంశీ 496 మార్కులు సాధించి జనరల్‌లో 63ర్యాంకు, రిజర్వేషన్ కేటగిరిలో స్టేట్ 3ర్యాంకు సాధించాడు. గతంలో ఆయన ఎస్ఐ ఉద్యోగంతో పాటు యూపీఎస్సీలో సెలక్ట్ అయి ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్, సెంట్రల్ పోలీసు అసిస్టెంట్ కమాండో,మిలటరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. 6వతరగతి నుంచి చైతన్య పాఠశాల, ఇంటర్ హైదరాబాదులో చదివి స్టేట్2 ర్యాంకు సాధించాడు. డిగ్రీ శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమిలోచేరి 10పాయింట్లకు 9.5 పాయింట్లు సాధించాడు. ఢిల్లీలో పీజీ జేఎన్‌యూలో పూర్తి చేశాడు.గతంలో ఎస్ఐతోపాటు మూడు సెంట్రల్‌జాబ్‌లు సాధించాడు. గ్రూప్‌లో ఇప్పుడు ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు.

సుస్మితకు అభినందనలు

ఖమ్మంసంక్షేమ విభాగం: ఇటీవల ప్రకటించిన గ్రూప్1 పరీక్షల్లో డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగం సాధించిన గోపిశెట్టి సుస్మితను ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ నాయకుడు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు అభినందించారు. ఫలితాల్లో బీసీ యువత మంచి ప్రతిభను కనబర్చారని, కీలకమైన ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో సుస్మితను నాయకులు అభినందించారు.

విద్యార్థులపై పోలీసుల అరాచకం

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి



మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులపై పోలీసుల అరాచకత్వం పెరిగిపోయిందని, హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాలపై పోలీసుల దాడి హేయమైన చర్యని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్ ఖండించారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం వేలం వేసేందుకు పూనుకుందని, భవిష్యత్ విద్యార్థుల దృష్టిలో ఉంచుకొని విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయన్నారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకొని ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగించాలని విన్నవించారు. లేనిపక్షంలో తీవ్ర ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు వినయ్, పృథ్వీ, యశ్వంత్, నవీన్, నరేందర్, శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

పల్లెబోయిన కుటుంబానికి తుమ్మల పరామర్శ

రఘునాథపాలెం, మార్చి31: ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన పల్లెబోయిన పుల్లమ్మ కుటుంబ సభ్యులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన సంతాప సభలో మంత్రి తుమ్మల పాల్గొని పుల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. పుల్లమ్మ కొడలు భారతి, చంద్రాన్ని కుటుంబ సభ్యులతో మంత్రి తుమ్మల మాట్లాడారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మోటూరు వర్ధంతి సభ

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): మోటూరు ఉదయం స్ఫూర్తితో మహిళలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మోటురు ఉదయం 23వ వర్ధంతి సభను నిర్వహించారు. నాయకులు మెరుగు రమణ, బండి పద్మ, అమరావతి, భాగం అజిత, ప్రమీల, కోటేశ్వరి, భూలక్ష్మీ, ఉష పాల్గొన్నారు.

ఫకీరాకు కందాళ నివాళి



ఫకీరా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కందాళ

తిరుమలాయపాలెం, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతండా గ్రామమాజీ సర్పంచ్ బోడ మంచానాయక్ తండ్రి బోడ ఫకీరా సోమవారం మృతిచెందాడు. కాగా ఆయన భౌతికకాయాన్ని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫకీరా కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, మండల అధ్యక్షుడు వీరన్న, బానోతు రవి, బోడ రఘు తదితరులున్నారు.

రిటైర్డు ఉద్యోగుల సంఘం వార్షికోత్సవం

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి31(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల రిటైర్డు ఉద్యోగుల సంఘం తృతీయ వార్షికోత్సవం సోమవారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. మార్కండేయస్వామి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు. ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఒక్కరికి రూ.6వేల వంతున మొత్తం రూ.12వేలుఅందించారు. ఈకార్యక్రమంలో పిల్లలమర్రి కొండలరావు,పెండెం జనార్ధన్, దుస్సా సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు సంపత్‌కుమార్, చందా వీరభద్రం పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగికి సన్మానం



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన భుంపటి తిరుపతమ్మను డీఈ ఎన్.రామారావు, 327 యూనియన్ నాయకులు ఎన్.సత్యనారాయణరెడ్డి, కె.మహేష్, ఉద్యోగులు సోమవారం వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. విధుల్లో అంకితభావంతో పనిచేసి సంస్థలో విశిష్ట సేవలందించారని కొనియాడారు.

వేసవిలో పొగమంచు...

వైరా, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సోమవారం వేకువజామున ఓవైపు సన్నటి వర్షపుజల్లులతోపాటు దట్టమైన పొగమంచు అలుముకుంది. ఆదివారం భరించలేని రీతిలో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. అర్ధరాత్రి నుంచి ఆకాశం మేఘావృతమైంది. కొద్దిపాటి చినుకులు పడ్డాయి. అదే సమయంలో దట్టమైన పొగమంచు అలుముకుంది. ఉదయం ఏడుగంటల సమయంలో మంచు దుప్పట్లో వాహన చోదకులు లైట్ల వెలుతురులో రాకపోకలు కొనసాగించారు.



ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- చెన్నారం సొసైటీ అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వందనపు నాగేశ్వరరావు

నేలకొండపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారుల బారినపడుతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెన్నారం సహకార సంఘం అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు కోరారు. సోమవారం చెన్నారం సహకార సంఘం సమావేశం సంఘ ఆవరణలో నిర్వహించారు. తొలుత సమావేశంలో ఆడిట్ రిపోర్టును చదివి వినిపించారు. జమాఖర్చుల నివేదికను ఆమోదించారు. సమావేశంలో అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. సొసైటీ నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. సొసైటీ ఇప్పటికి రూ.10లక్షలు లాభాల్లో ఉందన్నారు.కార్యక్రమంలో మాజీఛైర్మన్ చింత నిప్పు సైదులు, రచ్చా నర్సింహారావు, సొసైటీ కార్యదర్శి మూర్తి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్ఐకు నగదును అందజేస్తున్న గ్రామస్తులు

నేలకొండపల్లి, మార్చి31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అజయ్‌తండాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తండావాసులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సంతోష్‌కు రూ.40వేల నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ఎస్ఐ పెంటరి సంతోష్ విలేకరులతో మాట్లాడుతూ నేరాలను అదుపు చేయటంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉంటాయన్నారు. ఒక్కొక్కసారి గుర్తు తెలియని వాహనాలు ప్రమాదాలు చేసి తప్పించుకు పోతుంటాయని, అటువంటి వాటిని గుర్తించటంలో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ప్రజల సహకారంతో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మరికొన్ని గ్రామాల్లో ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకొచ్చారని చెప్పారు. ఆయా గ్రామాల్లో సాధ్యమైనంత త్వరలోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటానికి ఆయా గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు. తేజావత్ శివాజీ, శంకర్, మాలోతు సక్రు,తేజావత్ రామ్మోహన్, తేజావత్ చంద్రు, బానోతు బాలాజీ, తేజావత్ పుష్యా తదితరులు నగదు అందించిన వారిలో ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కమిటీ

- ఏదులాపురం మునిసిపాలిటీలో ఆవిర్భావం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

ఖమ్మంరూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని కాలనీలల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయాలు, ఉద్యోగసంఘాలకు అతీతంగా కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగ పెన్షనర్ల ఆధ్వర్యంలో సోమవారం నూతన కమిటీ ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలైన మిషన్‌భగీరథ, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యం, తదితర వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేదుకు వీలుగా ఈ కమిటీ పని చేస్తుందన్నారు. అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఇది పని చేస్తుందన్నారు. ఈ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్, వై.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుతో పాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. అఅనంతరం కమమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.



ఆంధ్రజ్యోతి
ZONE
మంగళవారం 1 ఏప్రిల్ 2025
వైరా-మధిర
8 సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

నత్తనడకన రైల్వే బ్రిడ్జి పనులు

- ఐదు నెలలుగా సాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కొనసాగుతున్న పనులు

మధిరటౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): మధిరలోని రైల్వే ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. మధిర పట్టణం గుండా రైల్వే ట్రాక్ పోవడంతో రైలు వచ్చినప్పుడల్లా మధిరలో ఉన్న పాత రైల్వేగేటు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుండటంతో రెండున్నర దశాబ్దాల క్రితం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో స్లాబుకు స్లాబుకు మధ్య వేసిన రబ్బర్లు తరచూ ఊడిపోతుండడంతో, శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి అయిన వెంటనే బ్రిడ్జి మరమ్మతులకు రూ.72 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఐదు నెలల క్రితం పనులు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. కొంతకాలానికి పనులు నిలిపివేశాడు. మళ్లీ రెండు నెలల తరువాత పనులు చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరో పది రోజులు పనులు చేస్తే మరమ్మతులు పూర్తవుతాయనుకుంటున్న తరుణంలో మరోసారి పనులు వదిలేసి వెళ్లిపోయాడు. ఈ సారి స్లాబు, స్లాబుకు మధ్య ఉన్న గ్యాపులను పగలగొట్టి వదిలేసి వెళ్లిపోవడంతో పగలగొట్టిన దగ్గర ఇనుప చువ్వలు లేచి ప్రమాదకరంగా ఉండటంతో దాని పైనుంచి వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు పెట్టారు. లడకబజార్ వైపు ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా మూసి వేయడంతో వాహనాలన్నీ ఆర్వోబీ పై నుంచే వెళ్లవలసి రావడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి, ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి త్వరగా మరమ్మతులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దీనిపై ఆర్అండ్‌బీ జేఈ రాంబాబును వివరణ కోరగా మరమ్మతులకు కావలసిన సామగ్రి కలకత్తా నుంచి రావాలసి ఉందని, సామగ్రి రాగానే వారం రోజుల్లో పనులు పూర్తయ్యే విధంగా చూస్తామని అన్నారు.

'ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి'

నేలకొండపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని చెన్నారం సహకార సంఘం అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు కోరారు. సోమవారం చెన్నారం సహకార సంఘం సమావేశం సంఘ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీచైర్మన్ చింతనిప్పు సైదులు, రచ్చా నర్సింహారావు, సొసైటీ కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కమిటీ

ఖమ్మంరూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని కాలనీలల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయాలు, ఉద్యోగసంఘాలకు అతీతంగా కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగ ఫెన్సనర్ల ఆధ్వర్యంలో సోమవారం నూతన కమిటీ ఏర్పాటు జరిగింది. అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఇది పని చేస్తుందన్నారు. ఈ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.విజయ్, వై.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుతో పాటు మరి కొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

శ్మశానవాటిక స్థలంలో ఆక్రమణలను తొలగించాలి

- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం


ఆక్రమణల వివరాలు భట్టికి తెలుపుతున్న తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధిరటౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): మధిరలో హిందూ శ్మశాన వాటిక స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం మధిరలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో తహసీల్దార్ రాంబాబు నుంచి ఆక్రమణ వివరాలను తెలుసుకున్నారు. ఆక్రమణ దారుల్లో బీపీఎల్ కుటుంబాలను మినహాయించి ఆక్రమణలో ఉన్న మిగతా వారి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇటీవల శ్మశాన స్థలాన్ని నకిలీ పాస్ పుస్తకం, నకిలీ నాలా కన్వర్షన్‌కు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మధిరలో హిందూ శ్మశాన వాటికకు చెందిన స్థలాన్ని కొందరు నకిలీ పాస్ పుస్తకం, ఆర్డీవో ద్వారా నాలా కన్వర్షన్ అయినట్లు నకిలీ సర్టిఫికెట్ సృష్టించి మధిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి గత డిసెంబర్ 30న వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ విషయం డిప్యూటీ సీఎం దృష్టికి వెళ్లడంతో ఆయన శ్మశాన స్థలంతో పాటు డొంక ఆక్రమణ విషయంపై ఆరా తీసి సమగ్ర సర్వే చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో అధికారులు సర్వే చేయగా మొత్తం 36 మంది ఆక్రమించుకున్నారని ఉప ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. ఆక్రమణ దారుల్లో 16 మంది పేద కుటుంబాల వారు ఇళ్లు కట్టుకుని జీవనం సాగిస్తుండగా, మరో ఏడుగురు భవనాలు నిర్మించుకోగా, మరో తొమ్మిది మంది స్థలాన్ని తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. శ్మశానంతో పాటు ప్రభుత్వ డొంక దాదాపు రెండు ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్లు అధికారులు తెల్పారు.

రైతు ఆత్మహత్యలను నివారించాలి : రైతు సంఘం

వైరా, మార్చి31 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆత్మహత్యలు నివారించి, కౌలురైతులకు భరో సా కల్పించాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని విప్పలమడక గ్రామంలో ఆదివారం రాత్రి ఉగాది పర్వదినాన సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన స్టడీ సర్కిల్‌లో రాంబాబు ప్రసంగించారు. భారతీయ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టే కుట్రకు పాలకులు తెరలేపారని ఆరోపించారు. అందుకు కారణం ప్రస్తు త ప్రభుత్వం కార్పొరేటర్ల అనుకూల ప్రభుత్వమని విమర్శించారు. దేశ ఆర్థిక వనరులు సగానికిపైగా వ్యవసాయంపైనే వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకొనేందు కు ప్రపంచంలో ఏ దేశంలో జరగనంత గొప్ప రైతాంగ ఉద్యమం దేశ రాజధానిలో 13నెలలపాటు జరిగిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకొనేందుకు రైతులు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, కొలికొండ వీరభద్రం, రైతుసంఘం మండల అధ్యక్షుడు మేడా శరాబందీ, సొసైటీ డైరెక్టర్ దేవభక్తిని అర్జున్‌రావు, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి గరిడేపల్లి సుబ్బారావు, నాయకులు రుద్రాక్షల వెంకటాచారి, కొల్లా వెంకటేశ్వర్లు, మోతుపల్లి రామారావు, ఇనపనూరి శ్రీను పాల్గొన్నారు.

సుబ్బారావుకు మంత్రి తుమ్మల నివాళి


సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

వేంసూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం దూళ్లకొత్తూరు గ్రామానికి చెందిన ఉప్పలపాటి సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం గ్రామంలో ఆయన దశదినకర్మలు జరిగాయి. సుబ్బారావు చిత్రపటానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావు కుమారులు భానుకిరణ్, విజయ్‌కుమార్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి, సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు ఉన్నారు. కార్యక్రమంలో కలపాల శేఖర్, కలపాల వాసు, ఎర్రా సత్యనారాయణ, కలపాల మధు, ప్రసాద్‌రాజు, గిరిబాబు, కలపాల కృష్ణశరత్, పగుట్ల వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి కృష్ణయ్య, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మారోజు సురేష్, కంటే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కల్లంగా క్రీడా ప్రాంగణం


రేజర్ల క్రీడా ప్రాంగణంలో ఆరబోసిన ధాన్యం

తల్లాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రేజర్లలో క్రీడా ప్రాంగణాన్ని కొందరు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులతో మూడేళ్ల క్రితం క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటుచేశారు. సరైన నిర్వహణ లేకపోవడంతో క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. దీంతో ఖాళీగా ఉన్న క్రీడా ప్రాంగణంలో నూర్పిడి చేసిన దాల్వా వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ఉపయోగిస్తున్నారు.

గార్లొడ్డు మినీ లిఫ్ట్ నిర్మాణానికి కృషి: ఎమ్మెల్యే

ఏన్కూరు, మార్చి31(ఆంధ్రజ్యోతి): త్వరలోనే గార్లఒడ్డు మినీ లిఫ్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హామీ ఇచ్చారు. సోమవారం సాగర్ మెయిన్ కెనాల్ లిఫ్ట్ ఏర్పాటు ప్రాంతాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. లిఫ్ట్ ద్వారా గార్ల ఒడ్డు ఎర్రచెరువును నింపడం, సాగు, తాగు నీరు అందించడంతో పాటు దేవాలయానికి తాగునీరు అందించేందుకు లిఫ్టును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ2కోట్లతో కిలోమీటరు కాలవ ద్వారా 200 ఎకరాల భూమిసాగులోకి వస్తుందన్నారు. ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత వరకు ఏడాదిలో లిఫ్ట్ నిర్మాణం పూర్తిచేయించి గార్లఒడ్డు నీటి సమస్యను తీరుస్తానని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప అయిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరిగిందనితెలిపారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేయడం జరిగిందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ పక్కా గృహాలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున దశలవారీగా నిర్మాణం చేడతామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మండల నాయకులు మేడ ధర్మారావు, లాలునాయక్, పులబాల నరసింహారావు, మాలోతు నరసింహారావు, బత్తిని కొండయ్య, పంతగాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకులగూడెంలో...

కారేపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టేకులగూడెంలో సోమవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పర్యటించారు. గ్రామంలోని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య నివాసగృహంలో ఆయనను కలుసుకుని మాట్లాడారు. ఈసందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


లిఫ్ట్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వేసవిలో పొగమంచు...


పొగమంచు కారణంగా లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు

వైరా, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఓవైపున తీవ్ర ఉక్కపోత, మరోవైపున దట్టమైన మంచుతో వాతావరణ సమతుల్యత ఘోరంగా దెబ్బతింటుంది. సోమవారం వేకువజామున ఓవైపున సన్నటి వర్షపుజల్లులతోపాటు దట్టమైన పొగమంచు అలుముకుంది. ఆదివారం భరించలేని రీతిలో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. అకస్మాత్తుగా అర్థరాత్రి నుంచి ఆకాశం మేఘావృతమైంది. కొద్దిపాటి చినుకులు పడ్డాయి. అదే సమయంలో దట్టమైన పొగమంచు అలుముకుంది. ఉదయం ఏడుగంటల సమయంలో మంచు దుప్పట్లో వాహనచోదకులు లైట్ల వెలుతురులో రాకపోకలు కొనసాగించారు.

విద్యార్థులపై పోలీసుల దాడి సరికాదు

- పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి31(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో విద్యార్థులపై పోలీసుల అరాచకత్వం పెరిగిపోయిందని, హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాలపై పోలీసుల దాడి హేయమైన చర్యని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం వేలం వేసేందుకు పూనుకుందని, భవిష్యత్ విద్యార్థుల దృష్టిలో ఉంచుకొని విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, వినయ్, పృథ్వీ, యశ్వంత్, నవీన్, నరేందర్ పాల్గొన్నారు.


మధిరటౌన్‌లో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న భట్టి


సత్తుపల్లి రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి


కల్లూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దయానంద్


సత్తుపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఘనంగా రంజాన్ వేడుకలు

రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ ద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ముస్లింలు పర్సస్పరం అలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్నేహితులు, బంధువులకు సేమియా పంపిణీ చేశారు. మధిర పట్టణంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి పట్టణంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, తుమ్మల యుగంధర్, కల్లూరులో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, పలువురు నాయకులు ప్రార్థనలో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా మసీదులన్నీ ముస్లిం సోదరులతో కిటకిటలాడాయి.


ఎర్రుపాలెంలో రంజాన్ తోఫాను అందజేస్తున్న దృశ్యం


తల్లాడలో...


మధిరరూరల్‌లో...


వైరాలో...


చింతకానిలో...


పెనుబల్లిలో...


బోనకల్‌లో...


ఏన్కూరులో..


కారేపల్లిలో...


ముదిగొండలో...